సాక్షి
కుమురం భీం
ఆదివారం। 8। అక్టోబర్। 2023



ఎర్రబస్సు నుంచి ఏసీ బస్సు వరకు..
అంచెలంచెలుగా ఆర్టీసీ పరిణామక్రమం చెందుతోంది. ఆటుపోట్లను తట్టుకుని నిలదొక్కుకుంటోంది. ప్రయాణికుల ఆదరణ పెంచుకుని ముందుకుసాగుతోంది. 8లో▸



ఏళ్లుగా కష్టాలు..!
స్వాతంత్య్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా గ్రామీణ రహదారులు అభివృద్ధికి నోచుకోవడంలేదు. దీంతో 'గిరి'జన గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. 9లో▸

గరిష్టం/కనిష్టం
35.0 /23.0

వాతావరణం
సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్వో

ఆసిఫాబాద్‌రూరల్: చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎస్వో సుభాష్ సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఈనెల 5వ తేదీన జరిగిన హ్యాండ్‌బాల్ పోటీల్లో అండర్–14 విభాగంలో సాయిచరణ్, మహేశ్, అండర్–17లో హర్ష, రాహుల్ ప్రతిభ కనబర్చి జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు విద్యాసాగర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులు లేక ప్రయాణికుల ఇబ్బందులు

- మంత్రి హరీశ్‌రావు పర్యటన ఎఫెక్ట్

కాగజ్‌నగర్‌టౌన్: మంచిర్యాల జిల్లా చెన్నూరులో శనివారం రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పర్యటించిన నేపథ్యంలో ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో పరిధిలోని ఎక్కువ శాతం బస్సులు కార్యకర్తల తరలింపునకు కేటాయించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఆసిఫాబాద్ డిపో నుంచి నిత్యం ఆశించిన స్థాయిలో కాగజ్‌నగర్, బెజ్జూర్, కౌటాల, సిర్పూర్ (టీ), పెంచికల్‌పేట తదితర ప్రాంతాలకు బస్సులు రాకపోకలు సాగిస్తుండగా గంటల తరబడి బస్సులు బస్టాండ్‌లోకి రాకపోవడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. చేసేదేమీ లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. దీంతో కాగజ్‌నగర్ నుంచి ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ నుంచి బెల్లంపల్లి, కాగజ్‌నగర్ నుంచి మంచిర్యాల మార్గాల్లో ప్రైవేట్ వాహనాల్లో ఎక్కువ డబ్బులు చెల్లించి వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు ప్రయాణాలు సాగించినట్లు తెలిసింది.

మద్దతు ధరకు విక్రయించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: వానాకాలం పండించిన పంటలను కనీస మద్దతు ధరకు విక్రయించుకోవాలని జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆసిఫాబాద్ ఏఎంసీ పరిధిలో 13, కాగజ్‌నగర్ పరిధిలో రెండు, జైనూర్ పరిధిలో ఒక జిన్నింగ్ మిల్లులున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ పరిధిలోని రెండు జిన్నింగ్ మిల్లుల్లోనూ పత్తి విక్రయించుకోవచ్చని సూచించారు. పొడుగు పింజపత్తికి రూ.7,020, పింజరకానికి రూ.6,970, పింజరకానికి (మెక్) రూ.6,920 మద్దతు ధర నిర్ణయించినట్లు వెల్లడించారు. వరి సాధారణ రకానికి రూ.2,183, గ్రేడ్ 'ఏ' రకానికి రూ.2.203, హైబ్రిడ్ జొన్న రూ.3,180, సజ్జలు రూ.2,500, కందులు రూ.7వేలు, పెసలు రూ.8,558, మినుములు రూ.6,950, వేరుశెనగ రూ.5,377, సోయాబీన్ రూ.4,600, నువ్వులు రూ.8,635, పొద్దుతిరుగుడు రూ. 6,760, పత్తి మధ్య రకానికి రూ.6,620గా ధర నిర్ణయించినట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన



ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో భోజనం చేస్తున్న కార్మికులు

కాగజ్‌నగర్‌టౌన్: అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. శనివారం మధ్యాహ్న భోజన కార్మికులు కొందరు ఎంఈవో కార్యాలయం, మరి కొంత మంది కాపువాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. ఎంఈవో కార్యాలయ ద్వారానికి తాళం వేసి అధికారులను నిర్బంధించారు. పోలీసుల జోక్యంతో తలుపులు తిరిగి తెరిచారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి వచ్చిన కార్మికులు అక్కడే ఉన్న జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావుకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సీఎం కేసీఆర్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేరుస్తారని జెడ్పీ వైస్ చైర్మన్ ఈ సందర్భంగా కార్మికులకు భరోసా ఇచ్చారు. అనంతరం ముట్టడికి వచ్చిన కార్మికులకు భోజనం వడ్డించారు. సీఐటీయూ నాయకులు ముంజం శ్రీనివాస్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ ప్రశ్నార్థకం..!



రాంపూర్‌లో దోమల వ్యాప్తిని అరికట్టేందుకు మందులు పిచికారీ చేయిస్తున్న ఓపీఎస్

- ఓపీఎస్‌ల విషయం తేల్చని సర్కార్
- పనికి తగిన వేతనం లేక ఇబ్బందులు
- కొనసాగలేక.. వదులుకోలేక సతమతం
- జేపీఎస్‌గా క్రమబద్ధీకరణకు డిమాండ్

రెబ్బెన(ఆసిఫాబాద్): ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శుల (ఓపీఎస్‌లు) భవిష్యత్‌ను ప్రభుత్వం ప్రశ్నార్థకంలో పడేసింది. వీరి విషయంలో తన వైఖరి తెలుపకుండా జాగ్రత్త పడుతోంది. ఓ వైపు మిగతా శాఖల్లో పని చేస్తున్న సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తుండగా.. గ్రామాలాభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేయడం, గ్రామాలను పరిశుభ్రంగా.. పచ్చదనంతో ఉంచడం లాంటి కీలక పాత్ర పోషిస్తున్న ఓపీఎస్‌ల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదు. కొద్దినెలల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు (జేపీఎస్‌లు) రెగ్యులరైజ్ చేయాలని చేపట్టిన సమ్మెలో ఓపీఎస్‌లూ పాలుపంచుకున్నారు. జేపీఎస్‌లను వారి పనితీరు ఆధారంగా రెగ్యులరైజ్ చేస్తున్న సర్కార్ ఓపీఎస్‌ల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవటంతో వారి భవిష్యత్ ప్రశ్నార్థకంలో పడినట్లయింది.

పనికి తగిన వేతనాల్లేక..
రాష్ట్ర ప్రభుత్వం తండాలు, గూడేలను పంచాయతీలుగా ఏర్పాటు చేసి ప్రతీ పంచాయతీకి ఒక పంచాయతీ కార్యదర్శి ఉండాలనే లక్ష్యంతో నాలుగేళ్ల క్రితం పంచాయతీ కార్యదర్శుల నియామకాల కోసం రాతపరీక్ష నిర్వహించింది. మెరిట్ సాధించిన వారిని జేపీఎస్‌లుగా నియమించింది. అయితే అదే సమయంలో వీఆర్వో, ఫారెస్ట్, పోలీస్ ఉద్యోగాల ఫలితాలు కూడా విడుదలయ్యాయి. దీంతో ముందుగా జేపీఎస్‌లుగా ఉద్యోగాలు సాధించి విధుల్లో చేరినవారు ఆపై వీఆర్వో, ఫారెస్ట్ శాఖల్లో ఉద్యోగాలు రావటంతో వారి పోస్టును వదులుకున్నారు. దీంతో పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శుల పోస్టుల ఖాళీలు ఏర్పడటంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో ఓపీఎస్ నియామకాలు చేపట్టారు. జేపీఎస్ రాతపరీక్ష మెరిట్ సాధించి ఉద్యోగాలు పొందని అభ్యర్థులను అధికారులు రూ. 15 వేల వేతనంతో ఓపీఎస్‌లుగా నియమించారు.

'రెగ్యులర్' ఆశతో చేరితే..
భవిష్యత్‌లో రెగ్యులరైజ్ అవుతుందనే ఆశతో ఎంబీఏ, ఎంటెక్, పీజీ చేసిన అభ్యర్థులు తక్కువ వేతనానికే ఓపీఎస్‌లుగా విధుల్లో చేరారు. అయితే ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి తీపి కబురు అందలేదు. వేతనాల పెరుగుదలలోనూ ఎలాంటి మార్పులు చేయలేదు. దీంతో వారు నిరుత్సాహానికి గురవుతున్నారు. పంచాయతీ కార్యదర్శులు, జేపీఎస్‌లతో సమానంగా ఓపీఎస్‌లు విధులు నిర్వహిస్తున్నా వేతనాల్లో మాత్రం భారీ వ్యత్యాసాలున్నాయి. ప్రభుత్వం జేపీఎస్‌లను కూడా రెగ్యులరైజ్ చేస్తూ పేస్కేల్ అమలు చేస్తోంది. ప్రభుత్వం ఓపీఎస్‌లకు పేరుకే రూ.15వేలు అందిస్తున్నా కాంట్రాక్టర్ కమీషన్, పీఎఫ్, ఈఎస్‌ఐ వంటి కోతలు పోనూ వారి చేతికి రూ.10వేలకు మించి అందటం లేదు.

నెలల తరబడి పెండింగ్‌లోనే..
ప్రభుత్వం ఓపీఎస్‌లకు అరకొరగా అందించే వేతనాలు కూడా సక్రమంగా ఇవ్వకపోవడంతో కుటుంబాల పోషణకు ఆర్థికంగా అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక్కో ఓపీఎస్‌కు ఐదు నెలలు గడిచినా వేతనాలు అందని పరిస్థితి. వేతనాల కోసం అధికారులు, ఔట్‌సోర్సింగ్ సంస్థల ప్రతినిధులను సంప్రదించినా సరైన సమాధానం రావడంలేదు. దీంతో అప్పు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వం అందించే వేతనాల్లో విధించే కోతల వివరాలు కూడా ఔట్‌సోర్సింగ్ సంస్థలు ఓపీఎస్‌లకు తెలుపటం లేదు. ప్రభుత్వం ఎంత మొత్తంలో వేతనాలు చెల్లిస్తుందో.. ఏయే వాటికి ఎంత కోత పెడుతుందో తెలియక ఆందోళన చెందుతున్నారు. ఓపీఎస్‌ల వేతనాల్లోంచి పీఎఫ్ కోసం కోత పడుతున్నా చాలామంది ఓపీఎస్‌లకు కనీసం వారి పీఎఫ్ ఖాతా వివరాలు, ఖాతాలో జమ అయిన మొత్తాలపై ఎలాంటి సమాచారం తెలుపడంలేదు.

కొనసాగలేక.. వదులుకోలేక..
జిల్లాలో 63మంది ఓపీఎస్‌లు విధులు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో పరిశుభ్రత, పచ్చదనం, హరితహారం మొక్కల పెంపకం, నర్సరీల నిర్వహణ, ఉపాధిహామీ పనుల కల్పన, పన్నుల విధింపు.. వసూళ్లు, గ్రామసభలు, సమావేశాల నిర్వహణ, ప్రభుత్వ పథకాల అమలు, లబ్ధిదారుల గుర్తింపు, పంచాయతీ రికార్డుల నిర్వహణ, పల్లె ప్రకృతివనాలు, వైకుంఠ ధామాలు, ఇంటింటా సేకరించిన తడి, పొడి చెత్తను సెగ్రిగేషన్ షెడ్లు, డంప్‌యార్డులకు తరలింపు వంటి పనులు నిర్వహిస్తున్నారు. వీటితో పాటు ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం మొదలు గతేడాది పోడు పట్టాల దరఖాస్తుల స్వీకరణ వరకు అన్ని ప్రభుత్వ పథకాల అమలులో వీరిని ప్రభుత్వం భాగస్వాములను చేస్తోంది. దీంతో తీవ్ర పనిభారంతో ఒత్తిడికి గురవుతున్నారు. అయినప్పటికీ జేపీఎస్‌లుగా మారుస్తారేమో.. అనే కొండంత ఆశతో ఓపీఎస్‌లు తమ విధుల్లో కొనసాగుతున్నారు. అయితే రోజురోజుకూ పంచాయతీ కార్యదర్శులకు పెరుగుతున్న పనిభారం, రెగ్యులరైజ్ విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవటంతో జేపీఎస్‌లుగా కొనసాగాలా.. వద్దా.. అని ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. తీవ్ర పనిభారంతో ఇతర ఉద్యోగ పోటీపరీక్షల కోసం సిద్ధం కావటానికి కావాల్సిన సమయం కూడా దొరకకపోవటంతో ఆవేదన చెందుతున్నారు. ఇతర జిల్లాల్లో కొంతమంది ఓపీఎస్‌లను జేపీఎస్‌లుగా మార్చినప్పటికీ ఈ జిల్లాలో మాత్రం ఈ ప్రక్రియ ఇంకా ప్రారంభించలేదు. మరికొన్ని రోజుల్లో సాధారణ ఎన్నికలకు సంబంధించిన ఎలక్షన్ కోడ్ వచ్చే అవకాశం ఉండటంతో ఆలోపైనా ప్రభుత్వం తమ విషయంలో ఏదైన ఒక నిర్ణయం తీసుకోవాలని ఓపీఎస్‌లు కోరుతున్నారు.

ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బోర్కడె హేమంత్

- కలెక్టర్ బోర్కడె హేమంత్
- అధికారులతో సమావేశం

ఆసిఫాబాద్‌అర్బన్: రాబోయే శాసనసభ ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని కలెక్టర్ బోర్కడె హేమంత్ సహదేవ్‌రావ్ సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు, అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావ్, ఆర్డీవో సురేశ్‌కుమార్‌తో కలిసి ఎన్నికల్లో భాగంగా చెక్‌పోస్ట్, ర్యాలీలు, బహిరంగ సభల వద్ద విధులు నిర్వహించే పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, మండల స్థాయి అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల కార్యాచరణ విడుదలైన తర్వాత ఎన్నికల నియమావళిలో భాగంగా జిల్లాలో పటిష్ట చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎన్నికల్లో ప్రజలను ప్రలోభపెట్టేందుకు ధనం, మద్యం, కానుకల ప్రభావం లేకుండా చూడాలని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ విధులు నిర్వహించే అధికారులు ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి సంబంధిత ప్రాంతాలకు త్వరగా చేరుకోవాలని సూచించారు. చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని, మద్యం, నగదును అక్రమంగా తరలించే అవకాశం ఉన్నందున అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలని సూచించారు. ర్యాలీలు, బహిరంగ సమావేశాల వద్ద వీడియో, ఫొటో చిత్రీకరించి ఆ సమాచారాన్ని ఎన్నికల అధికారికి పంపించాలని పేర్కొన్నారు. 24 గంటలపాటు బదిలీల వారీగా విధులు నిర్వహించాలని, సీ–విజిల్ ద్వారా ఫిర్యాదు అందితే గంటలోపు చేరుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. నివేదికలు సంబంధిత రిటర్నింగ్ అధికారులకు అందించాలని పేర్కొన్నారు. ర్యాలీలు, బహిరంగ సభల వద్ద రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే కేసులు నమోదు చేయాలని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. సెక్టార్ అధికారులు, చెక్‌పోస్టుల సిబ్బంది, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల బరిలో 14 యూనియన్లు

- సింగరేణిలో ముగిసిన నామినేషన్ల పర్వం



శ్రీరాంపూర్: సింగరేణిలో 7వ దఫా జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. ఇందులో భాగంగా శుక్ర, శనివారాల్లో నామినేషన్లు స్వీకరించారు. హైదరాబాద్‌లోని డెప్యూటీ సీఎల్సీ సమక్షంలో యూనియన్ నాయకులు నామినేషన్లు అందజేశారు. శనివారం సాయంత్రానికి నామినేషన్ల ప్రక్రియ ముగియగా, ఈ నెల 9న ఉప సంహరణ ఉంది. నామినేషన్ వేసిన సంఘాలన్నీ పోటీలో ఉండడం సింగరేణి ఎన్నికల్లో సర్వసాధారణం.

సంఘాలివే..
సింగరేణి ఎన్నికల్లో పోటీకి నామినేషన్లు వేసిన సంఘాల వివరాలిలా ఉన్నాయి. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ), తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్), సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్టీయూసీ), సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్), సింగరేణి మైనర్స్ అండ్ ఇంజినీర్ వర్కర్స్ యూనియన్ (హెచ్ఎమ్మెస్), సింగరేణి కాలరీస్ ఎంప్లాయాస్ యూనియన్ (సీఐటీయూ), సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్(టీఎన్టీయూసీ), గోదావరి లోయబొగ్గు గని కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ), సింగరేణిగని కార్మిక సంఘం, ప్రజాతెలంగాణ సింగరేణి కార్మిక సంఘం(టీఎస్టీయూసీ), శ్రామికశక్తి గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం (ఏఐఎఫ్‌టీయూ), తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం, తెలంగాణ రీజినల్ సింగరేణి కార్మిక సంఘం, సింగరేణి డ్రైవర్స్ ఈపీ ఆపరేటర్స్, అండర్‌గ్రౌండ్ ఆల్ ట్రేడ్ వర్కర్స్ అసోసియేషన్ నామినేషన్లు వేశాయి.

బేటీ బచావో–బేటీ పడావోపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న కలెక్టర్ బోర్కడె హేమంత్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో 'బేటీ బచావో–బేటీ పడావో' కార్యక్రమంపై సంబంధిత అధికారుల సమన్వయంతో ప్రత్యేక దృష్టి సాధించాలని కలెక్టర్ బోర్కడె హేమంత్ సహదేవ్‌రావ్ సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బాలికలకు విద్య, వైద్యం అందించే అంశాలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాఠశాలలు, వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. గ్రామపంచాయతీ కార్యాలయాల్లో 'బేటీ బచావో– బేటీ పడావో' కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహిస్తూ అవగాహన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో షీటీంల ద్వారా గ్రామాల్లో ఆడపిల్లల చదువుపై భరోసా కల్పించాలని, మైనార్టీ శాఖ ఆధ్వర్యంలో పాఠశాలల నుంచి డ్రాపౌట్స్‌ను గుర్తించి తిరిగి పాఠశాలలకు వచ్చేలా సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు చేపట్టాలని తెలిపారు. బాలికలు చదువుతోపాటు క్రీడారంగంలో రాణించేలా ప్రోత్సహించాలని, అందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినులకు ఆత్మరక్షణపై నైపుణ్య శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం 'బేటీ బచావో–బేటీ పడావో' కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని సంబంధిత అధికారులతో ఆవిష్కరించారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులకు సాయపడొద్దు

- ఎస్పీ సురేశ్‌కుమార్
- 'మావో' ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన



గోవింద్‌రావుకు నిత్యావసరాలు ఇస్తున్న ఎస్పీ

కెరమెరి(ఆసిఫాబాద్): అసాంఘిక శక్తులకు ఎలాంటి సహాయ, సహకారాలు అందించకూడదని ఎస్పీ సురేశ్‌కుమార్ సూచించారు. శనివారం మండలంలోని మావోయిస్టు ప్రభావిత, అత్యంత మారుమూల గ్రామాలైన చాల్‌బాడి, పరంధోళిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా చాల్‌బాడీలో మాట్లాడారు. అసాంఘిక శక్తుల నుంచి ఎలాంటి లాభం లేదని తెలిపారు. సమస్యలుంటే ప్రభుత్వం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని తెలిపారు. ఎలాంటి ఇబ్బంది ఉన్నా చెప్పాలని సూచించారు. ఈ సందర్భంగా చాల్‌బాడి గ్రామానికి చెందిన వృద్ధుడు కొరెంగ గోవింద్‌రావును కలిసి బాగోగులు తెలుసుకున్నారు. అతడికి నెలకు సరిపడా నిత్యావసరాలు, పండ్లు, మాత్రలు అందించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన పరంధోళి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన వెంట డీఎస్పీ వెంకటరమణ, వాంకిడి సీఐ శ్రీనివాస్, కెరమెరి ఎస్సై గుంపుల విజయ్, సిబ్బంది ఉన్నారు.

మహిళలు సమస్యలపై స్పందించాలి
ఆసిఫాబాద్‌అర్బన్: మహిళలు, యువతులు ఎలాంటి సమస్యలున్నా నిర్భయంగా తెలుపాలని ఎస్పీ సురేశ్‌కుమార్ సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు షీటీంకు 28 ఫిర్యాదులు రాగా.. ఎనిమిది ఎఫ్ఐఆర్‌లు, 11 కౌన్సిలింగ్, ఒక పెట్టి కేసు నమోదు చేశామని తెలిపారు. ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగామ్‌ల వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, ఫొటోలు, వీడియోలు పోస్టు చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించి అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యలపై నేరుగా స్పందించలేనివారు 87126 70564 లేదా 100కు డయల్‌కు సమాచారం తెలిపితే వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే..

- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన



మాట్లాడుతున్న ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/చెన్నూర్: రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్‌ఎస్ మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని, హాజీపూర్ మండలంతోపాటు మంచిర్యాల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం ఆయన మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం దొనబండలో ఏర్పాటు చేసిన సభావేదిక వద్ద రూ.80.50కోట్లతో నిర్మించనున్న శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు–పడ్తనపల్లి ఎత్తిపోతల పథకానికి, దొనబండలో రూ.1.90కోట్లతో నిర్మించనున్న 33/11కేవీ సబ్‌స్టేషన్ పనులకు, చెన్నూర్ పట్టణంలో రూ.10కోట్లతో నిర్మించిన 50 పడకల ఆస్పత్రి, రూ.55కోట్లతో రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు, ధోబీఘాట్ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. చెన్నూర్ మండలం సుద్దాల వాగుపై రూ.15కోట్లతో నిర్మించిన వంతెన ప్రారంభించారు. దొనబండ సభ, చెన్నూర్ రోడ్డు షోలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. మంచిర్యాల జిల్లా ఏర్పాటుతోపాటు 380 పడకల ఆస్పత్రి, గుడిపేటకు వైద్య కళాశాల తీసుకురావడంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు కృషి ఉందని తెలిపారు. వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో నేడు ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయిలో మెరుగైన, నాణ్యమైన వైద్యసేవలు అందుతున్నాయన్నారు. దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోందని, ఈ క్రమంలో ఆగంకాకుండా సమగ్రంగా ఆలోచించి తగిన నిర్ణయంతో మరోసారి ఎన్నికల్లో ఎమ్మెల్యేగా దివాకర్‌రావును గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రావడం ఖాయమని, మూడోసారి సీఎంగా కేసీఆరే అని జోస్యం చెప్పారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా ఎలాంటి అభివృద్ధి, సంక్షేమానికి తావు లేకుండా పాలనను భ్రష్టు పట్టించి ప్రజలను నయవంచన చేసిందని విమర్శించారు. భస్మాసుర కాంగ్రెస్‌తో మోసపోవద్దని హితవు పలికారు. బీజేపీ రకరకాల కమిటీలు వేయడం మాని డిపాజిట్లు దక్కించుకునే కమిటీ వేసుకుని డిపాజిట్లు దక్కించుకోవాలని ఎద్దేవా చేశారు. చెన్నూర్‌లో అభివృద్ధి పరంపర కొనసాగాలంటే మరోసారి బాల్క సుమన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని రోడ్డు షోలో సూచించారు. కార్యక్రమాల్లో పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేత, ఎమ్మెల్సీ దండె విఠల్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య పాల్గొన్నారు. మంత్రి హరీశ్‌రావుకు ప్రజాప్రతినిధులతోపాటు మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్, రామగుండం సీపీ రెమారాజేశ్వరి, డీసీపీ సుధీర్‌రాంనాథ్ కేకన్ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

తిర్యాణి: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా సెక్టోరియల్ అధికారి భరత్‌కుమార్ పేర్కొన్నారు. ఏక్ సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు మండల స్థాయిలో వివిధ పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని లక్ష్య సాధనకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సెద్మకి రాము, అంజయ్య, షేకు తదితరులున్నారు.

వంటగ్యాస్ వినియోగదారులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు

కాగజ్‌నగర్‌టౌన్: వంటగ్యాస్ ప్రమాదాల నివారణపై శనివారం స్థానిక ఎస్‌బీఐ సమీపంలో ఏర్పాటు చేసిన స్టాల్‌లో ఎల్పీజీ సేల్స్ మేనేజర్ ఎం.మహేశ్, కాగజ్‌నగర్ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు పీ కిషన్‌రావు వినియోగదారులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. గ్యాస్ ప్రమాదాల నివారణకు నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ప్రత్యేకంగా ఫైబర్ గ్యాస్ సిలిండర్లు ప్రముఖ కంపెనీల ఆధ్వర్యంలో తయారు చేసినట్లు తెలిపారు. ఫైబర్ సిలిండర్లతో ఎలాంటి గ్యాస్ లీకేజీలుండవని, పేలి పోవని స్పష్టం చేశారు. ప్రస్తుతం వినియోగదారుల వద్ద ఉన్న పాత సిలిండర్ల స్థానంలో నూతన ఫైబర్ సిలిండర్లను ఏజెన్సీ కార్యాలయంలో మంజూరు చేస్తున్నట్లు వివరించారు. గతంలో గ్యాస్ సిలిండర్లు కొనుగోలు చేసిన ధర, ప్రస్తుత కొత్త సిలిండర్ ధర మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వినియోగదారులు ఏజెన్సీలో చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రమాదాల నివారణ చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు, వినియోగదారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత

కాసిపేట(బెల్లంపల్లి): కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమగూడెంలో శనివారం అక్రమంగా తరలిస్తున్న 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై గంగారాం తెలిపారు. రెబ్బెన మండలం నారాయణపూర్‌కు చెందిన రేణు కృష్ణకుమార్ దేవాపూర్ గ్రామానికి చెందిన తంగెడుపల్లి అరవింద్ బియ్యాన్ని వ్యాన్‌లో మహారాష్ట్రకు తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. వాహనం, బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: మద్యం మత్తులో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలోని సంజీవయ్య కాలనీలో చోటు చేసుకుంది. ఎస్సై జగదీశ్ తెలిపిన వివరాల ప్రకారం కాలనీకి చెందిన పల్లెపు మల్లేశ్ (35) పెద్దపల్లి జిల్లా బసంత్ నగర్‌లోని అత్తగారింట్లో ఉంటూ సెంట్రింగ్ పనిచేసుకుంటూ జీవనం సాగించేవాడు. అక్కడ పని దొరకక పోవడంతో ఇటీవలే మంచిర్యాలకు వచ్చి ఇంటివద్దనే ఉంటున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసై ఇంట్లో భార్యతో తరచూ గొడవపడేవాడు. నెలరోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లింది. శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో మద్యం మత్తులో తాడుతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య సుగుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

జైనూర్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని శనివారం పట్టుకున్నట్లు తహసీల్దార్ హైమద్ ఖాన్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారి మీదుగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకుని కేసు నమోదు చేసి రూ.50 వేల జరిమానా విధించినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

'రాంజీగోండు విద్యార్థులకు చేయూతను అందిస్తాం'



చెక్కును అందిస్తున్న జీఎం మనోహర్

బెల్లంపల్లి: రాంజీ గోండు విద్యార్థి నిలయం విద్యార్థులకు సింగరేణి యాజమాన్యం తగిన చేయూతను అందిస్తుందని మందమర్రి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ ఎ.మనోహర్ అన్నారు. సింగరేణి సీఎస్ఆర్ నిధుల నుంచి వన వాసి కళ్యాణ పరిషత్ రాంజీగోండు విద్యార్థి నిలయం విద్యార్థులకు శనివారం ట్యూషన్ ఫీజు రూ.3లక్షల చెక్కును కోశాధికారి లక్ష్మీనారాయణకు అందజేశారు. కార్యక్రమంలో మందమర్రి ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, సేవ, కమ్యూనికేషన్ సెల్ కో ఆర్డినేటింగ్ అధికారి ఎండి ఆసిఫ్, రాంజీ గోండు విద్యార్థి నిలయం కమిటీ అధ్యక్షుడు విద్యాసాగర్, కార్యదర్శి కాసర్ల తిరుపతి, మహిళ ప్రముఖ్ రాచకొండ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో మందమర్రి గెలుపు

మందమర్రిరూరల్: ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో శనివారం మందమర్రి, బెల్లంపల్లి(నియర్ బై) ఏరియాల కబడ్డీ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో మందమర్రి ఏరియా జీఎం మనోహర్ హాజరై ప్రారంభించారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో మందమర్రి జట్టు 30పాయింట్లు సాధించి విజేతగా నిలువగా, బెల్లంపల్లి జట్టు 23పాయింట్లు సాధించింది. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రాజేశ్వర్ రెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, కార్తీక్, ఆసిఫ్, రవికుమార్ పాల్గొన్నారు.



ఎర్రబస్సు నుంచి ఏసీ బస్సు వరకు..

- అంచెలంచెలుగా ఆర్టీసీ పరిణామ క్రమం..
- ఆధునికత సంతరించుకున్న ప్రజా రవాణా సంస్థ
- ఆటుపోట్లను తట్టుకుని.. నిలదొక్కుకుని
- ఆదరణ పెంచుకుంటున్న ప్రగతి రథచక్రం
- ఉమ్మడి జిల్లాతో ప్రత్యేక అనుబంధం

ఆదిలాబాద్: ఒకప్పుడు తెలంగాణలో పక్క ఊరికి వెళ్లాలన్నా కాలినడకే శరణ్యం. స్వాతంత్ర్యానికి పూర్వం కేవలం ధనికులు, ఎగువ మధ్యతరగతి కుటుంబాలకు మాత్రమే ప్రైవేటు వాహనాలు ఉండడంతో దూరప్రాంతాలకు ప్రయాణం చేసేవారు. 1932లో నిజాం ప్రభువు మీర్ ఉస్మాన్ అలీఖాన్ హైదరాబాద్ రాష్ట్రంలో ప్రజా రవాణా వ్యవస్థను ప్రారంభించడంతో ప్రజలకు రవాణా సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ విధంగా ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కోట్లలో ప్రయాణికులను గమ్యస్థానాలకి చేరుస్తూ విడదీయలేని అనుబంధాన్ని ఏర్పర్చుకుంది.

ఇదీ చరిత్ర...

నైజాం పాలిత హైదరాబాద్ రాష్ట్రంలో 1932 వరకు నిజాం రైల్వే రవాణా సంస్థ మాత్రమే ఉండేది. కేవలం సంపన్న వర్గాలకు మాత్రమే ప్రైవేట్ వాహనాల ద్వారా రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉండేవి. అయితే సంస్థాన చివరి పాలకుడైన ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ తల్లి జహీరున్నీసా బేగం కోరిక మేరకు ఆయన హైదరాబాద్ రాష్ట్రంలో బస్సు రవాణా వ్యవస్థను ప్రారంభించారు. నైజాం రాష్ట్ర రైల్వే, రోడ్డు రవాణా సంస్థ పేరిట 1932లో బస్సు సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. దేశంలో బస్సుల తయారీ రంగం అంతగా అభివృద్ధి చెందని పరిస్థితుల్లో అప్పటి యునైటెడ్ కింగ్‌డం (ఇంగ్లాండ్) లండన్ నుంచి 27 బస్సులను ప్రత్యేకంగా ముంబై వరకు ఓడల్లో తీసుకువచ్చారు. అక్కడి నుంచి రహదారి మార్గంలో బస్సులు హైదరాబాద్ చేరుకున్నాయి. తల్లి స్మృత్యర్థం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ బస్సుల నంబర్ ప్లేట్లలో తన తల్లిపేరు జెడ్ అక్షరం వచ్చేలా రిజిస్ట్రేషన్ చేయించారు. రూ.3.71 లక్షల నిధులతో ప్రారంభమైన సంస్థ నేడు కోట్లలో ఆదాయం ఆర్జిస్తోంది.

ఉమ్మడి జిల్లా వివరాలు	నాడు	నేడు
డిపోలు	01	06
బస్సులు	07	612

ఆదిలాబాద్ రీజియన్ ముఖచిత్రం

ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని 1975లో మంచిర్యాల డిపో, 1980లో ఆదిలాబాద్ డిపో, 1991లో భైంసా, 1996లో ఉట్నూర్ డిపోలను ఏర్పాటు చేశారు. 1994లో రీజియన్ ఏర్పాటైంది.

ఎర్రబస్సు నుంచి..

1932లో 27 ఎర్రబస్సులతో ప్రారంభమైన ఆర్టీసీ ప్రస్థానం దినదినాభివృద్ధి చెందుతోంది. ఆధునిక విజ్ఞానం వేగంగా పెరగడంతో బస్సు పరిమాణం, కెపాసిటీ, వేగం సైతం పెరిగాయి. ఆర్టీసీ బస్సులకు గతంలో సెల్ఫ్‌స్టార్ట్ విధానం లేకపోవడంతో క్రాంకింగ్ విధానం ద్వారా తిప్పి బస్సును ప్రారంభించేవారు. అప్పట్లో బస్సు గంటకు 10 కిలోమీటర్ల వేగంతో నడిచేది. 100 కిలోమీటర్ల దూరం వెళ్లడానికి సుమారు 10 గంటల సమయం పట్టేది. ఈ బస్సులు పెట్రోల్‌తో నడిచేవి. రెండో ప్రపంచ యుద్ధకాలంలో చమురు కొరత సమస్య ఏర్పడడంతో కొన్ని రోజులపాటు బొగ్గు వినియోగించి ఆవిరి ద్వారా బస్సులు నడిపారు. ఆతర్వాత డీజిల్ బస్సులు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం ఎలక్ట్రిక్ బస్సులను సైతం సంస్థ ప్రవేశపెడుతోంది. మొదటితరం బస్సుల్లో డ్రైవర్, కండక్టర్‌తో పాటు 17 మంది మాత్రమే ప్రయాణించే వెసులుబాటు ఉండేది. నేటి బస్సులు గంటకు వందల కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్తుండగా సీట్ల కెపాసిటీ సైతం పెరిగింది. బస్సులను ఆధునీకరించడంతో విలాసవంతంగా ఎయిర్ కండిషన్డ్ బస్సుల్లో సురక్షితంగా ప్రయాణం చేయగలుగుతున్నారు.

రాష్ట్రంలోనే తొలి డిపో..

1932లో రాష్ట్ర వ్యాప్తంగా 16 డిపోలను నిర్మించారు. అసఫ్‌జాహీ వంశం పేరు మీదుగా ఏర్పడిన ఆసిఫాబాద్ జిల్లాపై ఉన్న మమకారంతో జిల్లా కేంద్రంలో డిపో నిర్మించి 7 బస్సులను కేటాయించారు. ఆసిఫాబాద్ నుంచి మహారాష్ట్రలోని రాజురా, మంచిర్యాల, రెబ్బెన రూట్లలో బస్సులు నడిపించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే ఇది తొలి డిపో కావడం విశేషం. ఈ డిపో 92 వసంతాలు పూర్తి చేసుకుంది.

నిర్మల్‌కూ ప్రత్యేకత...

నిర్మల్ జిల్లా కేంద్రంలో 1934 నవంబర్ 5న ఆర్టీసీ డిపో ప్రారంభమైంది. కేవలం ఐదు బస్సులు కేటాయించగా 15 నుంచి 20 మంది సిబ్బంది విధులు నిర్వర్తించేవారు. నైజాం కాలంలో నడిపిన 19 సీటర్ అల్బియన్ బస్సు నిర్మల్ డిపో నుంచి నాందేడ్ రూట్‌లో నడిపేవారు.

టిక్కెట్ టు డిజిటల్ పేమెంట్స్...

బస్సులో ప్రయాణించాలంటే టిక్కెట్ ఉండాల్సిందే. గతంలో కండక్టర్లు ప్రత్యేక ప్రత్యేకంగా ముద్రించిన టిక్కెట్లపై పంచింగ్ వేసి ఇచ్చేవారు. స్టేజీని బట్టి ప్రయాణికుల నుంచి డబ్బులు తీసుకొని పంచింగ్ చేసి టిక్కెట్లు ఇచ్చేవారు. ఎన్ని టిక్కెట్లు ఇచ్చారనే లెక్కలను ట్రిప్ షీట్‌లో నమోదు చేసేవారు. ఈ విషయంలో కండక్టర్లు మానసిక ఒత్తిడికి గురయ్యేవారు. పలు సందర్భాల్లో ఈ చిన్న విషయం ఆదాయంపై సైతం ప్రభావం చూపింది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఎలక్ట్రానిక్ టిక్కెట్ మెషిన్లు అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం టిమ్స్ (టికెట్ ఇష్యూయింగ్ మెషిన్)తో పాటు డిజిటల్ పేమెంట్లు సైతం ప్రారంభించారు.

విద్యార్థుల హాజరుశాతం పెంచాలి



రిజిష్టర్లను పరిశీలిస్తున్న శైలజ

బెల్లంపల్లి: కళాశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని డీఐఈవో శైలజ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరుశాతం, అధ్యాపకుల టీచింగ్ డైరీలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్నారు. డిసెంబర్ నెలాఖరు నాటికి విద్యాబోధనను పూర్తి చేసి ఆతర్వాత పోటీ పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ అంజయ్య, అధ్యాపకులు ఉన్నారు.

నామినేషన్ వేసిన టీబీజీకేఎస్



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో పోటీ చేసేందుకు టీబీజీకేఎస్ నామి నేషన్ దాఖలు చేసింది. నామినేషన్‌కు శనివా రం చివరిరోజు కావడంతో హైదరాబాద్‌లోని డెప్యూటీ సీఎల్సీ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులుకు యూనియన్ నేతలు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ అధ్యక్షుడు బీ.వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, డె ప్యూటీ ప్రధాన కార్యదర్శి రవూఫ్ పాల్గొన్నారు.

విధులను ఆటంకపర్చిన వ్యక్తిపై కేసు

కాగజ్‌నగర్‌రూరల్: ఎక్సైజ్ పోలీసుల విధులను ఆటంకపర్చిన మండలంలోని కోయవాగు గ్రామానికి చెందిన మలిశెట్టి పోచంపై శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై సోనియా తెలిపారు. అతనిపై పాత కేసులు ఉండగా బైండోవర్ చేసేందుకు వెళ్లిన ఎక్సైజ్ ఎస్సై కిషన్‌కు ఎదురుతిరగడమే కాకుండా విధులకు ఆటంకం కలిగించినట్లు ఆమె పేర్కొన్నారు.

'రాష్ట్రంలో కాంగ్రెస్ అనుకూల పవనాలు'



మాట్లాడుతున్న దుర్గాభవాని

బెల్లంపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ అనుకూల పవనాలు వీస్తున్నాయని, అధికార బీఆర్ఎస్ పార్టీపై వ్యతిరేకత కనిపిస్తోందని, ఈ విషయం ఈసారి జరిగే ఎన్నికల్లో స్పష్టం కానుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి చొప్పదండి దుర్గాభవాని అన్నారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్ బిల్లును అన్ని పక్షాలు ఏకతాటిపైకి వచ్చి ఆమోదించడాన్ని స్వాగతిస్తూ శనివారం బెల్లంపల్లి కాంటా చౌరస్తాలో బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ప్రచారం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల్లో ఓట్ల కోసం అమలుకు సాధ్యం కాని హామీలు ఇస్తున్నాయని తెలిపారు. గత 20 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పని చేస్తున్న తనకు బెల్లంపల్లి టిక్కెట్ ఇవ్వాలని అధిష్టానాన్ని కోరుతున్నట్లు తెలిపారు. అంకితభావంతో పని చేస్తున్న తన సేవలను అధిష్టానం గుర్తించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు దుర్గాప్రసాద్, రోహిత్, మహేష్, రోజారమణి, సంగీత, భాగ్యలక్ష్మి, బాబు, సంతోష్, లక్ష్మణ్, విజయ్‌ప్రకాష్, వినోద్‌కుమార్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ దాఖలు చేసిన టీఎన్టీయూసీ



నామినేషన్ దాఖలు చేస్తున్న నాయకులు

బెల్లంపల్లి: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో పోటీ చేసేందుకు సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ (టీఎన్టీయూసీ) నామినేషన్ పత్రాలు దాఖలు చేసినట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఠాకూర్ మణిరాంసింగ్ ప్రకటించారు. శనివారం హైదరాబాద్‌లోని డెప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ (సెంట్రల్) కార్యాలయంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దపల్లి సత్యనారాయణతో కలిసి నామినేషన్ పత్రాలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎంకే బోసు, కె.రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

'ముస్లింల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం'



మాట్లాడుతున్న యూసుఫ్‌బాబా

బెల్లంపల్లి: ముస్లింల సమస్యలు పరిష్కరించడంలో పాలక ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ అన్సారి, రచయిత యూసుఫ్‌బాబా అన్నారు. శనివారం రాత్రి తెలంగాణ ముస్లిం ఆర్గనైజేషన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని తాపీ కార్మిక సంఘ భవనంలో జరిగిన ముస్లిం డిక్లరేషన్ సభకు హాజరై మాట్లాడారు. ఏళ్లుగా ముస్లింలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదుగూబొదుగు లేకుండా జీవిస్తున్నారన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో విద్య, ఉద్యోగావకాశాలు లేక ముస్లిం యువత సతమతమవుతున్నారన్నారు. ముస్లింల జీవనోపాధిని పెంపొందించడానికి ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణ తయారు చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ముస్లిం ఆర్గనైజేషన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ కార్య నిర్వాహకుడు చాంద్‌పాషా, తెలంగాణ మూవ్‌మెంట్ విద్యార్థి నాయకులు సలీంపాషా, యూనుస్ ఫర్వేజ్, మునీరొద్దీన్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

లక్సెట్టిపేట: మండలంలోని చందారంలో సుమారు యాభై మంది కార్యకర్తలు బీజేపీలో చేరారు. జిల్లా అధ్యక్షుడు రఘునాథరావు వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కిషన్, నాయకులు వినోద్, గుండ ప్రభాకర్, సతీష్‌రావు, హేమంత్‌రెడ్డి, నరేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బస్సుల కోసం విద్యార్థుల నిరీక్షణ



చెన్నూర్ బస్టాండ్‌లో బస్సుకోసం నిరీక్షిస్తున్న విద్యార్థులు

చెన్నూర్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో శనివారం కోటపల్లి మోడల్‌స్కూల్‌కు వెళ్లేందుకు బస్సులు లేకపోవడంతో విద్యార్థులకు నిరీక్షణ తప్పలేదు. పాఠశాలకు వెళ్లేందుకు ఉదయం 8 గంటలకు బస్టాండుకు వచ్చిన విద్యార్థులు 11 గంటల వరకు వేచి ఉన్నా బస్సు రాకపోవడంతో విద్యార్థులు ఇంటికి వెనుదిరిగి వెళ్లిపోయారు. చెన్నూర్, హాజీపూర్‌లలో ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు ఆర్టీసీ బస్సులు అద్దెకు తీసుకున్నారు. దీంతో బస్సులు లేక విద్యార్థులతో పాటు వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

'మండలం ఏర్పడే వరకు పోరాడాలి'



మాట్లాడుతున్న మండల సాధన కమిటీ సభ్యులు

జన్నారం: కలమడుగును మండలం చేసేంత వరకు దశలవారీగా పోరాటం చేయాలని మండల సాధన కమిటీ పిలుపునిచ్చింది. శనివారం జన్నారం మండలంలోని కలమడుగు రైతువేదిక వద్ద అఖిలపక్ష నాయకులు సమావేశమయ్యారు. మండలం ఏర్పాటుకు గ్రామ పంచాయతీలో ఏకగ్రీవ తీర్మాణం చేశారు. అనంతరం అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలతో కలిసి ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు అందజేయాలని నిర్ణయించారు. మండలం సాధించే వరకు ఐకమత్యంగా ముందుకు సాగాలని వారు పేర్కొన్నారు.

అడహక్ కమిటీ ఎన్నిక

కలమడుగు మండల సాధన అడహక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా సర్పంచ్ యాదగిరి కార్తీక్‌రావు, కోకన్వీనర్‌గా స్వదేశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా బొంతల మల్లేశ్, కోశాధికారిగా జాడి శంకర్, కార్యదర్శులుగా నేరెళ్ల రాజన్న, పాత బాలరాజ్, దేశిరాజ్ వెంకటేశ్, జంగం సంతోష్, సలహాదారులుగా గట్టు మల్లేశ్‌యాదవ్, వంగపెల్లి దేవేందర్‌రావు, బండ దేవేందర్, జక్కుల శంకర్, సతీశ్‌గౌడ్‌లతో పాటుగా 22 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

మంత్రి హరీశ్‌రావుకు వినతుల వెల్లువ



బారులు తీరిన వివిధ సంఘాలు, ఉద్యోగులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండలో ఎత్తిపోతల పథకం శంకుస్థాపనకు విచ్చేసిన మంత్రి హరీశ్‌రావుకు ప్రజలు, వివిధ ఉద్యోగ, కుల సంఘాలు, ఉద్యోగులు పెద్ద ఎత్తున వినతిపత్రాలు అందజేశారు. కేజీబీవీ, యూఆర్ఎస్‌లలో కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేసి క్రమబద్ధీకరించాలని కోరుతూ కేజీబీవీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో, ఉపాధి హామీ ఉద్యోగులకు పే స్కేల్ వర్తింజేయాలని కోరుతూ ఈజీఎస్ జేఏసీ ఆధ్వర్యంలో, తలసేమియా వ్యాధిగ్రస్తులకు ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.15 వేల నుంచి రూ.30 వేలకు పెంచాలని తలసేమియా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.



వినతిపత్రం అందజేస్తున్న తలసేమియా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

ఎస్ఏల రిలీవ్‌కు విద్యాశాఖ సన్నాహాలు..!

- విద్యార్థుల సంఖ్య తక్కువ ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలపై నజర్

మంచిర్యాలఅర్బన్: దండేపల్లి మండలం మాదాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆరు, ఏడు తరగతులకు కలిపి ఐదుగురు విద్యార్థులు ఉండగా ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు పాఠాలు బోధిస్తున్నాడు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే ఉద్దేశంతో ఇటీవల బదిలీలలో పోస్టు ఖాళీ చూపించలేదు. ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు మాత్రం రెబ్బనపల్లి ఉన్నత పాఠశాలకు బదిలీయ్యాడు. పోస్టు ఖాళీ చూపించకపోయినా విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో విద్యాశాఖ అధికారులు బదిలీ అయిన రెబ్బనపల్లి పాఠశాలకు రిలీవ్ చేశారు. ఇలా జిల్లాలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలల వివరాల సేకరణలో విద్యాశాఖ నిమగ్నమైంది.

గొలుసు తెంపేందుకు..

ఇటీవల స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు పూర్తయ్యాయి. బదిలీ ఉపాధ్యాయుల స్థానంలో మరొకరు వచ్చినప్పుడే రిలీవ్ చేయాలనే నిబంధన వారికి గుదిబండగా మారింది. దీంతో 80 శాతంకు పైగా ఉపాధ్యాయులు యధాస్థానం (పాత పాఠశాల)లోనే ఉండాల్సి వచ్చింది. ఒక్క ఉపాధ్యాయుడు కదిలితే మరొకరు రిలీవ్ అయ్యే అవకాశాలున్నాయి. నిబంధనల ప్రకారం 6, 7 తరగతుల కోసం 100 వరకు ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గణితం లేదా సైన్స్, ఎస్ఏ సోషల్, లాంగ్వేజ్ పండిట్ (తెలుగు,హిందీ) నలుగురు ఉపాధ్యాయులు పనిచేయాలి. కొన్ని పాఠశాలల్లో పది నుంచి 20 లోపు విద్యార్థులున్నారు. ఇలాంటి పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న బదిలీ ఉపాధ్యాయులను కదిలించేందుకు విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. ఇటీవల తాండూర్ మండలంలో తక్కువ విద్యార్థులున్న ఓ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలు బదిలీ అయిన పాఠశాలకు (రిలీవ్) వెళ్లిపోవడంతో మరో మండలానికి చెందిన ఉపాధ్యాయుడు కదిలేందుకు అవకాశం లభించింది. దీంతో విద్యార్థులు తక్కువున్న ప్రాథమికోన్నత పాఠశాలల ఆరా తీసేపనిలో విద్యాశాఖ నిమగ్నమైంది. సోమవారం నాటికి పూర్తి సమాచారాన్ని సేకరించేందుకు సన్నాహాలు ముమ్మరం చేసింది. సాధ్యమైనంత వరకు గొలుసు (చైన్)తెంపి బదిలీ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలనే సమాలోచన చేస్తున్నారు. దీంతో ఎంతమంది ఎస్ఏ ఉపాధ్యాయులకు రిలీవ్ దొరుకుతుందో వేచి చూడాలి.